క్లుప్తంగా

నేడు అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


అభయ ఆంజనేయస్వామి

కొయ్యలగూడెం: కన్నాయిగూడెంలో ఈ నెల 30వ తేదీ నుంచి శ్రీకార్యసిద్ధి అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం విఘ్నేశ్వర పూజతో ప్రారంభమై అనంతరం హనుమద్ వ్రతం నిర్వహిస్తున్నట్లు పాలక మండలి పేర్కొంది. 31వ తేదీ లక్ష తమలపాకుల పూజ, ఫిబ్రవరి 1వ తేదీ శాంతి కల్యాణం, సువర్చల హనుమద్ కల్యాణోత్సవం నిర్వహించి మధ్యాహ్నం నుంచి అన్న సమారాధన సాయంత్రం నుంచి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు


అయ్యప్పస్వామి

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెంలో వేంచేసియున్న శ్రీహరిహరసుత అయ్యప్ప స్వామి వారి ఆలయంలో బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ చేయండి


ఎంఈఓ జె.సురేష్‌బాబుకి వినతిపత్రం సమర్పిస్తున్న సర్పంచ్, గ్రామ పెద్దలు

కొయ్యలగూడెం : దిప్పకాయలపాడులోని ఎంపీయూపీ స్కూల్‌ని ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని దిప్పకాయలపాడు పంచాయతీ పాలకవర్గం గ్రామ పెద్దలు ఎంఈఓ జె.సురేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో సుమారు 60 సంవత్సరాలకు పైగా స్కూల్ విద్యాభివృద్ధికి కృషి చేసిందన్నారు. అయితే ఉన్నత పాఠశాల అప్‌గ్రేడ్ స్థాయికి వెళ్లకపోవడం వలన విద్యార్థులు కన్నాపురం, కొయ్యలగూడేనికి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రాకపోకలు సాగించాల్సి వస్తుందన్నారు. అప్‌గ్రేడ్ స్థాయికి వెళ్లడం వలన సుమారు 100 మందికి పైగా విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, పంచాయతీ పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చినవెంకన్న సేవలో ఆర్చరీ క్రీడాకారిణి


శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జ్యోతి సురేఖ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ప్రముఖ ఆర్చరీ క్రీడా కారిణి వెన్నం జ్యోతి సురేఖ బుధవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆమె ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు స్వామి వారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు. దేశ అత్యుత్తమ క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డుకు జ్యోతి సురేఖ పేరును పరిగణలోకి తీసుకోవాలని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖను హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఆమె స్వామి వారిని దర్శించారు.

పేకాట శిబిరంపై దాడి

జంగారెడ్డిగూడెం: స్థానిక పోలీసులు పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు. ఎస్సై షేక్ జబీర్ ఆధ్వర్యంలో సుబ్బంపేట కాలనీ శివారు ఖాళీ ప్రదేశంలో దాడులు నిర్వహించి 14 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.11500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు

కొయ్యలగూడెం: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం బయ్యనగూడెంలో నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు ఆధ్వర్యంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొని మొక్కజొన్న రైతులకు సూచనలు సలహాలు అందజేశారు. ప్రధానంగా మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతిని గుర్తించామని వాటి నివారణకు తీసుకోవలసిన సస్య రక్షణ చర్యలు రైతులకు వివరించారు. అదే విధంగా మిరప పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలు సలహాలు అందజేశారు.

ఉద్యాన పంటల్లో జిప్సం పాత్ర కీలకం

- అధిక దిగుబడులకు సస్య రక్షణ చర్యలు మేలు
- వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి


చింతలపూడిలో రైతులు సాగు చేస్తున్న అరటి పంట

చింతలపూడి: ఉద్యాన పంటలైన ఆయిల్ పామ్, కొబ్బరి, అరటి, నిమ్మ, బత్తాయి, మామిడి, జీడి మామిడి తదితర పంటల్లో సల్ఫర్ (గంధకం) పోషకం ఉపయోగం ఎక్కువగా ఉంటుంది. తద్వారా అధిక దిగుబడులు పొందడానికి వీలవుతుంది. ఈ గంధకం మార్కెట్‌లో పలు రూపాల్లో లభ్యమవుతుంది. ముఖ్యంగా అమ్మోనియా సల్ఫేట్, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, సల్ఫేట్ ఆఫ్ పొటాష్, సల్ఫర్ గుళికలు, జింక్ సల్ఫేట్, మెగ్నీషియం సల్ఫేట్, మాంగనీస్ సల్ఫేట్, ఐరన్ సల్ఫేట్, జిప్సం రూపాల్లో దొరుకుతాయి. ఉద్యాన శాఖ సూచనలు పాటించి సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించొచ్చని చింతలపూడి ఉద్యానాధికారిణి ఎండీ షాఫియ ఫర్‌హీన్ తెలియజేస్తున్నారు.

జిప్సంతో అధిక దిగుబడులు

ఉద్యాన పంటలు స్వల్ప ఆమ్ల నేలల్లో అయితే మంచి దిగుబడులు రావటానికి అవకాశం ఉంది. రైతులు సల్ఫేట్ రూపంలో దొరికే ఎరువులను వాడినప్పుడు ఉదజని సూచిక పీహెచ్ 6.0–6.5 వరకు ఉంటుంది. కాబట్టి పండ్ల తోటల్లో గంధకం సూటి ఎరువులైన సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, అమ్మోనియా సల్ఫేట్, సల్ఫేట్ ఆఫ్ పొటాష్, జిప్సం ఎరువుల రూపంలో నేలలో వేసినట్లయితే దిగుబడులతో పాటు పండ్ల న్యాణ్యత పెరిగి మార్కెట్‌లో మంచి ధర వస్తుంది.

జిప్సం ఉపయోగాలు

జిప్సంలో కాల్షియం, గంధకం ఉంటుంది. కాల్షియం పండ్ల మొక్కల్లో వేరు పెరుగుదలకు, ముఖ్యంగా నూనె జాతి పంటల్లో దిగుబడిని గణనీయంగా పెంచి నూనె శాతం పెరగడానికి దోహదం చేస్తుంది.

ఆయిల్‌పామ్ తోటల్లో

ఆయిల్ పామ్‌లో కాపుకొచ్చిన చెట్లకు ఒక్కో చెట్టుకు ఐదు నుంచి పది కేజీల జిప్సంను రైతులు వేసుకోవాలి. ఈ విధంగా సంవత్సరానికి రెండు సార్లు జూన్, జూలై, ఫిబ్రవరి మాసాల్లో వేసుకోవాలి. పై సూచనల మేరకు ఎరువులను వాడుకుంటే మంచి నాణ్యమైన దిగుబడులు సాధించొచ్చు.

కొబ్బరి తోటల్లో

కొబ్బరి కాపు కాసే తోటల్లో ఒక్కో చెట్టుకు ఐదు కేజీల చొప్పున రెండు పర్యాయాలు వేసుకోవాలి. నిమ్మ, బత్తాయి తోటల్లో చెట్టుకు మూడు కేజీల నుంచి ఐదు కేజీలు, మామిడి చెట్లకు పది కేజీలు, అరటి తోటల్లో ఎకరాకు 300 కేజీలు, కూరగాయల పంటల్లో ఎకరాకు 250 కేజీలు జిప్సం వాడుకోవాలి.

వాడే విధానం ముఖ్యం



జిప్సంను ఉద్యాన పంటల్లో వాడే విధానం ముఖ్యం. ఉద్యాన పంటల్లో ఎకరాకు 250 కేజీల నుంచి 500 కేజీల వరకు వాడుకోవచ్చు. సాధారణంగా ఎకరాకు 300 కేజీలు సరిపోతుంది. చౌడు నేలలను దృష్టిలో పెట్టుకుని జిప్సంను 500 కేజీల వరకు వాడుకుంటే మంచిది.

– ఎండీ షాఫియ ఫర్‌హీన్, ఉద్యానాధికారిణి

700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం


బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

చింతలపూడి: మండలంలోని నాగిరెడ్డిగూడెం, పతంగుల గూడెం గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో నాగిరెడ్డిగూడెం వడిత్య కృష్ణ, తారా అనే ఇద్దరి వద్ద నుంచి 700 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. అదే విధంగా పంతంగులగూడెంలో 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. పాత నాటు సారా కేసుల్లో కూడా ముద్దాయిలైన వదిత్య కృష్ణ, తారలను ఇద్దరిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పీఎస్‌డీ భోగేశ్వరరావు, ఏలూరు స్టేషన్ ఎస్సై గౌరీ శంకర్, చింతలపూడి ఎస్సై ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

చిక్కాలకు వైఎస్సార్‌సీపీ నేతల సంఘీభావం


పాదయాత్ర నిర్వహిస్తున్న దుర్గాప్రసాద్‌కు సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కొయ్యలగూడెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పాదయాత్ర చేపట్టిన చిక్కాల దుర్గాప్రసాద్ యాత్రను విజయవంతంగా పూర్తి చేస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు పేర్కొన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల, ప్రభుత్వ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్న చిక్కాల దుర్గాప్రసాద్‌ను బుధవారం చింతలపూడి నియోజకవర్గంలో కలుసుకుని వైఎస్సార్‌సీపీ నాయకులతో సంఘీభావం తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాలని డిమాండ్‌తో ఏలూరు నుంచి కాకినాడ వరకు చిక్కాల పాదయాత్ర చేపట్టారన్నారు. కూటమి ప్రభుత్వం పేర్కొన్నట్లుగా 20 లక్షల ఉద్యోగాల హామీ, నిరుద్యోగులకు రూ.3 వేల చొప్పున భృతి ఇవ్వాలని ఈ సందర్భంగా చిక్కాల డిమాండ్ చేశారన్నారు. 31వ తేదీ పోలవరం నియోజకవర్గంలోకి ఆయన పాదయాత్ర ప్రవేశిస్తుందని నిరుద్యోగులు పార్టీలకు అతీతంగా యువత దుర్గాప్రసాద్‌కు ఆహ్వానం పలకాలని కోరారు. సర్పంచ్ పసుపులేటి రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు నూకల రాము, మండపాటి రామకృష్ణ, ఎస్‌కే బాజీ, టి.వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

రేపు ఉదయం 5 వరకే విద్యుత్

ద్వారకాతిరుమల: భీమడోలులోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో కండక్టర్ మార్పు, మరమ్మతుల కారణంగా ఈ నెల 31న వ్యవసాయం, తాగునీటి సర్వీసులకు ఉదయం ఐదు గంటల వరకు మాత్రమే కరెంట్ సరఫరా చేస్తామని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేడ్కర్ బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ విద్యుత్ కేంద్రం పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, పెదవేగి, దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాలకు చెందిన వ్యవసాయ, ఇతర విద్యుత్ వినియోగదారులు గమనించి, తమకు సహకరించాలని ఆయన కోరారు.

నేడు పలు గ్రామాలకు పవర్ కట్

స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం మరమ్మతులు చేయనున్నారు. అలాగే కరెంట్ వైర్లకు తగిలే చెట్ల కొమ్మలు తొలగించనున్నారు. ఈ క్రమంలో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు ద్వారకాతిరుమల, కొమ్ముగూడెం, లక్ష్మీపురం, దొరసానిపాడు, గుండుగొలనుకుంట కాలనీ, రాళ్లకుంట, సత్తెన్నగూడెం, తిమ్మాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ కేఎం అంబేడ్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

200 మందికి వైద్య పరీక్షలు


రోగులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కొయ్యలగూడెం: మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని అధ్యక్షుడు మాటూరి సుధీర్ పేర్కొన్నారు. వీఎస్ఎన్ కళాశాల ప్రాంగణంలో జంగారెడ్డిగూడెం రామచంద్ర శంకర నేత్ర చికిత్సాలయం వారి సౌజన్యంతో క్యాంప్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా ఔషధాలను పంపిణీ చేయడంతో పాటు కళ్లజోళ్లను అందించామన్నారు. సుమారు 200 మందికి పైగా పరీక్షలు నిర్వహించినట్లు సంస్థ కార్యదర్శి కంభంపాటి సాయి పేర్కొన్నారు. ప్రోగ్రాం కన్వీనర్ త్రిపుర రమేష్, మాజేటి ఉమ, సంస్థ మండల చైర్మన్ వీఎస్ఎన్ స్వామి, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, మండపాటి రామకృష్ణ, జి.రామ్మోహన్, ఎస్‌బీజీ శేఖర్, టి.చంటిబాబు తదితరులు సేవలందించారు.

1 నుంచి ఇంటర్ పబ్లిక్ మొదటి ఫేజ్ ప్రారంభం

జంగారెడ్డిగూడెం: ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షలు మొదటి ఫేజ్ ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభమవుతాయని శ్రీదామోదర సంజీవయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బోడపాటి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీన 'నైతిక, మానవ విలువలు', ఫిబ్రవరి 3వ తేదీ 'పర్యావరణ విద్య'పై పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలు ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కళాశాలలో నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం మొదటి సంవత్సరం విద్యార్థులతో పాటు, ఇంతకు ముందు ఈ పరీక్షలకు గైర్హాజరైన విద్యార్థులు హాజరవ్వొచ్చని తెలిపారు. ఈ పరీక్షలు 2025 సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో భాగంగా నిర్వహిస్తున్నందున విద్యార్థులు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా తల్లితండ్రులు శ్రద్ధ వహించాలని కోరారు. కాగా, కళాశాల నుంచి మొత్తం 165 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

కుక్కునూరు: ప్రభుత్వ అసమర్థ పాలనతో నిర్వాసితులకు తీరని అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బండి విజయభాస్కర్ విమర్శించారు. బుధవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు గజ్జి రాజులు అధ్యక్షతన కుక్కునూరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్ మాట్లాడుతూ నిర్వాసితులకు ఇప్పుడు పెరిగిన ధరలకు అనుగుణంగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీని పెంచి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ చైర్మెన్ రాజారత్నం ,మండల ఉపాధ్యక్షుడు వడ్డే రఘుబాబు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు మడకం వీరయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గాడిద మధుబాబు,సెక్రటరీ వీరాచారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి


పట్టిసం శివక్షేత్రం

పోలవరం రూరల్: పట్టిసం మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లకు సంబంధించి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో, ఉత్సవ కమిటీ చైర్మన్ ఎంవీ రమణకు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. పోలవరం మండలం అఖండ గోదావరి నది మధ్య గల పట్టిసం శివక్షేత్రం వద్ద ఇసుక తిన్నెలపై మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు లక్ష మందికి పైగా భక్తులు వీరేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఉత్సవాలకు సంబంధించి చేసే ఏర్పాట్లలో పట్టిసం పంచాయతీ, దేవస్థానం అధికారులు చేపడుతారు. నిధుల కొరతతో పంచాయతీ గత నాలుగు సంవత్సరాలుగా ఉత్సవాల సమయంలో చేసిన ఏర్పాట్లకు సంబంధించి టెండర్లదారులకు సుమారు రూ.20 లక్షల బకాయిలు పడింది. అందువల్ల ఈ ఏడాది చలువ పందిళ్లు, విద్యుత్ అలంకరణ, తాత్కాలిక మరుగుదొడ్లు, చేతిపంపులు తదితర ఏర్పాట్లు చేపట్టేందుకు టెండర్లు పిలిచినప్పటికీ పాత బకాయిలు ఉండిపోవడంతో ఈ ఏడాది పనులు చేసేందుకు టెండర్‌దారులు ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీకి వచ్చే ఆదాయం తక్కువ, ఖర్చు ఎక్కువ కావడంతో ఉత్సవాలకు సంబంధించిన బకాయిలు ఉన్నాయని కార్యదర్శి తెలిపారు. పంచాయతీ పరిస్థితి ఇలా ఉంటే ఇక దేవస్థానం అధికారులు కేవలం శివక్షేత్రం ప్రాంతం మాత్రమే ఏర్పాట్లు చేస్తున్నారు. క్షేత్రం దిగువన ఇసుక తిన్నెలపై భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లలో చలువ పందిళ్లు మరికొన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. పట్టిసం పంచాయతీ నిధుల కొరతతో ఉందని, కొన్ని ఏర్పాట్లు దేవదాయ అధికారులు చేయాలని గ్రామస్తులతో సహా పంచాయతీ పాలకవర్గం కూడా ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఏడాది ఉత్సవాల మూడు రోజులు పంచాయతీకి ఆదాయం లేకపోవడం వల్ల రూ.10 టిక్కెట్ పెంచుతున్నట్లు కార్యదర్శి తెలిపారు. కాలినడకన వెళ్లి వచ్చే భక్తులపై భారం మోపడంపై సమంజసం కాదని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై ఉత్సవ కమిటీ చైర్మన్, ఆర్డీవో ఎంవీ రమణ మాట్లడుతూ ఇక్కడున్న ప్రతీ సమస్య జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి దృష్టికి తీసుకెళతానని కలెక్టర్ ఆదేశాలతో ఏర్పాట్లు చేయాలన్నారు.

అంగన్‌వాడీలను సక్రమంగా నిర్వహించాలి


ఐటీడీఏ పీఓకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

బుట్టాయగూడెం: బాలింతలు, పిల్లలు, గర్భిణుల విషయంలో, అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఐటీడీఏ పీఓ కేతావత్ రాముల నాయక్ అన్నారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో పీఓను అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకుల బృందం బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పకుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు, ప్రాజెక్టు లీడర్ ఏఎస్ కృపామణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అనేక ఖాళీలు ఉన్నాయని వాటి భర్తీకి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వాస్పత్రులు, ఆశ్రమ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసినట్లు చెప్పారు. త్వరలోనే అంగన్‌వాడీ కేంద్రాలను కూడా తనిఖీ చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ లీడర్లు టి. రామలక్ష్మి, ఎం. పుష్ప, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

వినతులను స్వీకరించిన పీఓ

మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో బుధవారం గిరిజన దర్బారు నిర్వహించారు. కార్యక్రమంలో ఏజెన్సీ మండలాలకు చెందిన పలువురు సమస్యలపై వినతి పత్రాలను పీఓకు అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

టి.నరసాపురం: రహదారి ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జంగారెడ్డిగూడెం ఎంవీఐ ఎస్ఎస్ రంగనాయకులు అన్నారు. టి.నరసాపురంలో ఆటో, ట్రక్ యూనియన్ ఆధ్వర్యంలో రవాణా శాఖ అధికారులు రహదారి మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ ఇరువైపులా పాసెంజర్లను కూర్చో బెట్టుకుని ప్రయాణం చేయకూడదన్నారు. ఏఎంవీఐ వై.సురేష్‌బాబు మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఆటో నడపరాదన్నారు. నిబంధనలు పాటించి గమ్య స్థానం చేరాలని సూచించారు. కార్యక్రమంలో ఆటో, ట్రక్ డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. విజయవాడ గొల్లపూడికి చెందిన తాడికొండ హరి వెంకట సత్యమోహన్ జంగారెడ్డిగూడెంకు చెందిన రేణుక ప్రేమించుకుని పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు. వివాహ సమయంలో రేణుక తల్లిదండ్రులు రూ.10 లక్షల కట్నం, కేజీ వెండి, 15 కాసుల బంగారం కటనంగా ఇచ్చారు. కొంతకాలం కాపురం సజావుగానే సాగింది. అనంతరం మరో రూ.10 లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని సత్యమోహన్ వేధింపులకు గురిచేస్తున్నాడని, ఇందుకు అతడి కుటుంబ సభ్యులు సహకరిస్తున్నారని రేణుక పోలీసులకు ఫిర్యాదు చేసింది.